

నేడు తెలుగుగంగ నీరు 'బంద్': కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరానికి నీటి సరఫరా చేసే తెలుగు గంగ హెడ్ వాటర్ వర్క్స్ మెయింటెనెన్స్ వలన మంగళవారం నగరంలోని కొన్ని వార్డుల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళం పంపింగ్ స్టేషన్ నుండి మంగళం ఫిల్టరేషన్ ప్లాంట్స్ వరకు గల 1200 యం.యం.డయా పంపింగ్ మెయిన్ నందు ఆర్టీసీ డిపో దగ్గరలో పైపులైను డ్యామేజి అయ్యిందని తెలిపారు. ఈ పైప్లైన్ మరమ్మతుల వల్ల నగర ప్రజలకు 19 వ తేదీ మంగళవారం నగరంలోని ఒకటవ వార్డు నుండి 22 వరకు, 40 నుండి 50 వరకు, 25, 26, 27, 33, 34 వార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయము కలుగుతుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆ ప్రకటనలో కోరారు.

ప్రతి నెలా మొదటి మంగళవారం

'స్థానికులకు' శ్రీవారి దర్శనం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ బిఆర్ నాయుడు తొలి సమావేశంలోనే 'స్థానికులకు' శుభవార్త చెప్పారు. ప్రతి మంగళవారం తిరుపతి వాసులకు శ్రీవారి దర్శనాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించారు. టిటిడి పాలకమండలి బిఆర్నాయుడు అధ్యక్షతన తొలి సమావేశం సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో జరిగింది. అనంతరం మీడియాతో మాట్లాడారు. సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను వెల్లడించారు. బిఆర్నాయుడు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో విశేష సేవలు అందించిన ఉద్యోగులకు గత సంవత్సరం ఇచ్చిన బ్రహ్మోత్సవ బహుమానాన్ని 10 శాతం పెంచాలని నిర్ణయించినట్లు చెప్పారు. తద్వారా రెగ్యులర్ ఉద్యోగులకు రూ.15,400, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.7,535 బ్రహ్మోత్సవ బహుమానం అందనుంది. 17,400 శాశ్వత ఉద్యోగులు, 7,530 కాంట్రాక్టు ఉద్యోగులకు ఇస్తామన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని నిర్ణయించారు. అన్యమత ఉద్యోగులతో మాట్లాడతామని, విఆర్ఎస్ తీసుకుంటే విఆర్ఎస్ ఇస్తామని, లేకుంటే ఇతర ప్రభుత్వ శాఖలకు బదిలీ చేస్తామన్నారు. శ్రీనివాస సేతు పేరును తిరిగి గరుడవారధిగా మార్పు చేస్తున్నట్లు చెప్పారు. తిరుమలలో రాజకీయ ప్రసంగాలు నిషేధమని, మాట్లాడితే కేసులు పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. 'శ్రీవాణి' ట్రస్టును రద్దు చేసి, వేరే ట్రస్టులో విలీనం చేస్తామన్నారు. ప్రైవేట్ బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లను గవర్నమెంట్ బ్యాంకుల్లో డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిత్యాన్నదానాన్ని మరింత మెరుగుపరిచేలా మెనూలో మరిన్ని ఆహార పదార్థాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అలాగే శారదాపీఠానికి ఇచ్చిన స్థలాన్ని పూర్తిగా రద్దు చేసి టిటిడి స్వాధీనం చేసుకుంటుంది. టూరిజం టికెట్లు కేటాయింపులో భారీస్థాయిలో అవకతవకలు జరిగినట్లు సమాచారమని, పూర్తిగా రద్దు చేస్తున్నామన్నారు. అన్నదాన కేంద్రంలో రెండు లక్షల మందికి అన్నప్రసాదం వితరణ చేస్తామన్నారు. నూతన పరికరాలు అమర్చి, ఆధునీకరణను టివిఎస్ కంపెనీకి ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు. తిరుమలలో డంపింగ్ యార్డులోని చెత్తను మూడు లేదా నాలుగు నెలల్లో క్లియర్ చేయాలని నిర్ణయించామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిటిడి ఈవో శ్యామలరావు ఉన్నారు.

బ్రహ్మోత్సవ బహుమానం 10శాతం పెంపు



పలువురి హర్షం

ప్రతినెలా మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శన సౌకర్యం కల్పించడంపై ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు హర్షం ప్రకటించారు. ఎన్డిఎ కూటమి ఇచ్చిన హామీని టిటిడి పాలకమండలి తొలి సమావేశంలోనే అమలు చేయడం ఆనందదాయకమని అన్నారు. అలాగే గరుడ వారధి పేరును గత ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో ఫ్లై ఓవర్ పేరు మార్చిందని, దీన్ని తిరిగి గరుడ వారధిగానే ఉంచేలా నిర్ణయించారు. అలాగే కూటమి నాయకులు నవీన్కుమార్రెడ్డి వేరే ప్రకటనలో హర్షం ప్రకటించారు.

ఏపీ బీసీ స్టడీ సర్కిల్లో 'సివిల్స్'కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -రామచంద్రపురం (తిరుపతి రూరల్)

యూపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసి ప్రిలిమ్స్ అండ్ మెయిన్స్ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్న బీసీ విద్యార్థులు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ నందు ఇచ్చే ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఏపీలో బీసీ విద్యార్థులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఎక్కువమంది విజయాలు సాధించడం కోసం, ప్రభుత్వం ప్రత్యేకంగా ఏపీ స్టేట్ బిసి స్టడీ సర్కిల్ను ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ అందజేస్తుందన్నారు. ఈ ఉచిత శిక్షణ బీసీ భవన్, గొల్లపూడి, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా నందు ఉంటుందన్నారు. అర్హత కలిగిన బీసీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేసిన 100 మంది విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నారు. బీసీ-66శాతం, ఎస్సీ-20శాతం, ఎస్టీ-14శాతం విద్యార్థులను రిజర్వేషన్ల నిబంధనల మేరకు ఎంపిక చేయబడుతుందన్నారు. వీరికి ఉచిత కోచింగ్తో పాటు ఉచిత వసతి, భోజనం సౌకర్యాలు కల్పిస్తారు.

రేషన్కార్డు లేక గిరిజనుల ఇక్కట్లు

ప్రజాశక్తి - సత్యవేడు

రేషన్కార్డు లేక గిరిజనులు ఇక్కట్లు వర్ణనాతీతమని, పేదరికంలో ఉన్న గిరిజనులకు ప్రభుత్వ పథకాలేవీ ఈ కారణంగా అందడం లేదని సిపిఎం నాయకులు మెలుగు రమేష్ పేర్కొన్నారు. మదనంబేడు పేరడం గ్రామంలోని గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ గ్రామంలో మూడు తరాలకు చెందిన 20 కుటుంబాల వారికి ఆధార్, రేషన్కార్డులు, ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డులేవీ లేవన్నారు. నిరుపేదలైన గిరిజనులకు రేషన్ బియ్యం అందక ఆకలితో అలమటిస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా, స్థానిక అధికారులు బేఖాతర్ చేస్తున్నారన్నారు. కలెక్టర్ చొరవ చూపి దళిత గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. డిసెంబర్ 1, 2 తేదీల్లో సత్యవేడులో జరగనున్న సిపిఎం జిల్లా మహాసభల్లో దళిత గిరిజనుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

'గ్రీవెన్స్'లో అగ్రభాగం రెవెన్యూ సమస్యలే..!

108 ఉద్యోగులు, ఆశ, హమాలీల నిరసనలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా అధికారులకు మొరపెట్టుకుని అయినా పరిష్కారం చేసుకోవాలని జిల్లా నలుమూలల నుండి ప్రజలు సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తరలివచ్చారు. మొత్తం 168 అర్జీలు రాగా అందులో 109 రెవెన్యూ విభాగానికి చెందినవే కావడం గమనార్హం. మరోవైపు జిల్లా కలెక్టరేట్ వద్ద 108 ఉద్యోగులు, ఆశ వర్కర్లు, హమాలీల సమస్యల సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. విద్యార్థుల హాస్టల్ లో వసతి భోజనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు మంచి భోజన వసతులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ను కలసి అర్జీ ఇచ్చారు.

108ని ప్రభుత్వమే నడపాలి : సునీల్, యూనియన్ గౌరవాధ్యక్షులు

అత్యవసర ప్రమాద పరిస్థితులలో ప్రజల ప్రాణాలను కాపాడే 108 సర్వీసుని రాష్ట్ర ప్రభుత్వమే నడిపి ప్రజాధనాన్ని కాపాడాలి. 108 నడపడానికి ప్రైవేటు సంస్థలు ఎందుకు ఉత్సాహం చూపుతాయో అందరికీ తెలుసు. వైద్య ఆరోగ్యశాఖలో ఈఎంటి పోస్టుల నియామకాల్లో 108లో పనిచేసే ఈఎంటి సిబ్బందిని నియమించాలి. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలి. 108 సర్వీసుల నిర్వహణకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న ప్రైవేటు కంపెనీ నుండి రావలసిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించే విధంగా బాధ్యత తీసుకోవాలి.

బకాయిలు ఇప్పించాలి : పారిశుధ్య కార్మికురాలు, శెట్టిపల్లి

శెట్టిపల్లె పంచాయతీ నుండి విధులు నిర్వహిస్తూ నగరపాలికలో విలీనమైన తరువాత కూడా దాదాపు 20 నెలలుగా జీతాలు ఇవ్వలేదు. తిరుపతి నగరపాలక సంస్థలో మారిపోయిన ముగ్గురు కమిషనర్లకు మా సమస్య చెప్పుకున్నాం. విలీనం అయిన నాటినుండి నగరపాలక సంస్థ మూడవ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తూనే ఉన్నాము. వారికి చెప్పి చెప్పి విసిగిపోవడంతో జిల్లా కలెక్టరేట్లో మాసమస్య మొరపెట్టుకుందామని ఇక్కడికి వచ్చాము. జిల్లా ఉన్నతాధికారులైనా బకాయి జీతాన్ని ఇప్పించాలని వేడుకుంటున్నాం.

ఉన్నట్టుండి ఉపాధి కోల్పోయాం : దినసరి కూలీలు, నాయుడుపేట

నాయుడుపేట మండలం, మేనకూరు సెజ్లో 12 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన లాయల్ టెక్స్ టైల్స్ అండ్ మిల్స్ లిమిటెడ్ యాజమాన్యం ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఫ్యాక్టరీని మూసేశారు. మాకు రావలసిన బకాయిల కోసం సెప్టెంబర్ 6 నుండి లేబర్ అధికారులను, ఇతర విభాగాల అధికారుల చుట్టూ తిరుగుతూ ఉన్నాం. మా ప్రాంతంలో ఉన్న ఈ టెక్స్ టైల్ కంపెనీ లేబర్ విభాగం పరంగా నెల్లూరు జిల్లాకు వర్తిస్తుందని, భూభాగం మాత్రం తిరుపతి జిల్లా పరిధిలో ఉండటం మాకు శాపంగా మారింది. మా సమస్య ఎవరికీ చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. లేబర్ అధికారులకు ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందని వందలాది మంది కార్మికులు వెళ్లినా యాజమాన్యం నుండి ఎవరూ అధికారుల వద్దకు రావడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని మాకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

సమస్యలు పరిష్కరించాలి : అదనపు కమిషనర్

ఫిర్యాదుదారులు సంతృప్తి పడేలా సమస్యలు పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుమారు 29 మంది వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అదనపు కమిషనర్కు వినతి పత్రాలు సమర్పించారు. అందులో ముఖ్యంగా వీధుల్లో చెత్త తొలగించాలని, టి.డి.ఆర్. బాండ్లు ఇప్పించాలని, టిడ్కో ఇండ్లు ఇప్పించాలని, డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయాలని, మా కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

వర్షం పడిందంటే...

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద అంతరాయం

పోతిరెడ్డిపాలెం జలమయం

ప్రజాశక్తి - దొరవారిసత్రం

వర్షం పడిందంటే రైతులకు ఆనందం.. అయితే వర్షం వదలకుండా పడిందంటే మాత్రం పోలిరెడ్డిపాలెం స్థానికులకు గుండెల్లో గుబులు.. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు మోకాళ్ల లోతు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఒకసారైతే సరే.. సర్దుకుపోతారు.. వర్షం పడిన ప్రతిసారీ ఇదే పరిస్థితి.. దాదాపు రెండు మూడు రోజుల పాటు ఆ ప్రాంతంలో నిలిచిపోయిన మురుగునీటితో ఈదుకుంటూ వెళ్లాల్సిందే. వాహనదారులకైతే వాహనాల మరమ్మతుతో జేబులు ఖాళీ అయ్యే పరిస్థితి. ఈ మార్గంలో ఫ్యాక్టరీలకు, ఉపాధి పనులకు, సూళ్లూరుపేటకు వెళ్లాలంటే అగ్రహారం, కల్లూరు, శ్రీధనమల్లి మీదుగా సూళ్లూరుపేటకు చేరాల్సి ఉంటుంది. బ్రిడ్జి వద్ద నిలిచిపోయిన నీటిని ఎప్పటికప్పుడు మోటార్లతో తొలగించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాల్సిన రైల్వే శాఖ సిబ్బంది పట్టించుకోకపోవడంతో గొల్లపాలెం, గొల్లపాలెం గిరిజనకాలనీ, ముత్తరాశిపాలెం, సూరపు అగ్రహారం గ్రామాల ప్రజల అవస్థలు వర్ణనాతీతం. దొరవారిసత్రం నుంచి మినమలముడి గ్రామాల వద్ద ఉన్న అండర్ పాస్ బ్రిడ్జి నీటిని తొలగిస్తున్నారు. అయితే పోలిరెడ్డిపాలెం బ్రిడ్జి వద్ద మాత్రం నీటిని తొలగించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇకనైనా రైల్వేశాఖ స్పందించి అండర్ పాస్ బ్రిడ్జిలో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు మోటార్ల ద్వారా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలల పనివేళల పెంపు సరికాదు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

విద్యాశాఖలో అసంబద్ధ విధానాలకు స్వస్తి పలికి ఆచరణాత్మక, తులనాత్మక శాస్త్రీయ విధానాన్ని అవలంబించాలని ఫోర్టో (ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్) ఉమ్మడి చిత్తూరు జిల్లా చైర్మన్ దొడ్డ ఉమామహేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో పని వేళలను పెంచడం శాస్త్రీయ విధానానికి, మనో విశ్లేషణ సిద్ధాంతానికి వ్యతిరేకం అన్నారు . ఒకసారి అన్ని రాష్ట్రాల పాఠశాలల పని వేళలను పరికించి చూస్తే దక్షిణాది రాష్ట్రాల్లోనే కాకుండా అక్షరాస్యతలో దేశంలోనే అగ్రస్థానంలో వున్న కేరళలో ఉదయం 9.10 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు, కొన్ని పాఠశాలలు 10 నుంచి 4 గంటల వరకు, ఉన్నత పాఠశాలల్లో 7.30 నుంచి 1.30 వరకు నిర్వహిస్తారు. విరామ సమయం తీసేస్తే అన్ని పాఠశాలల గరిష్ట పని వేళలు ఐదు గంటలు మాత్రమే. తెలంగాణలో ఉదయం 9 నుంచి 4.15 వరకు నిర్వహిస్తున్నారన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో 33/11 కె.వి. పాలిటెక్నిక్ సబ్ స్టేషన్ పరిధిలోని వరదరాజ నగర్, వరద రాజ నగర్ టి. టి. డి. క్వార్టర్స్ నందు 11కెవి లైన్లు, ఎల్టీ లైన్లు, ట్రాన్స్ఫార్మర్లు, ట్రీ కటింగ్లో భాగంగా విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరాయం కలగనున్నట్లు డిఇ చంద్రశేఖర్రావు ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

లెనోవా11 కొత్త లాప్టాప్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

లెనోవా కే11 టాబ్లెట్ అప్ గ్రేడెడ్ వెర్షన్ లెనోవో ట్యాబ్ కే11 (ఎన్ హాన్స్ డ్ ఎడిషన్)ను దేశ మార్కెట్లో విడుదల చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ క్యాటగిరి హెడ్ ఆశిష్ సిక్క ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అత్యాధునిక వేరియంట్ సంస్థలు, నిపుణుల విభిన్న అవసరాలను తీర్చడానికి రూపొందించబడింది. లెనోవో ఇండియా డైరెక్టర్, కేటగిరీ హెడ్ ఆశిష్ సిక్కా మాట్లాడుతూ లెనోవో ట్యాబ్ కె 11 (మెరుగైన ఎడిషన్) లూనా గ్రే కలర్లో రూ.22,999 ప్రారంభ ధరతో లభిస్తుందని తెలిపారు.

పోలీసులపై ప్రివిలేజ్ మోషన్ : తిరుపతి ఎంపీ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఫిర్యాదు చేయడానికి పోలీస్స్టేషన్కు వెళ్తే, కనీసం తీసుకోడానికి కూడా పోలీసులు ఆసక్తి చూపలేదని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిపై జుగుప్సాకర పోస్టుల్ని సోషల్ మీడియాలో పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో ఈస్ట్ పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం తిరుపతి ఎంపీ మీడియాతో మాట్లాడుతూ మహేశ్ అనే వ్యక్తి ద్వారా తమ నాయకులపై అసభ్య పోస్టుల గురించి తెలుసుకున్నామన్నారు. ఆ పోస్టులు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు ఫిర్యాదు చేయడానికి పోలీసుస్టేషన్కు వస్తే, దాదాపు 40 నిమిషాల సమయం అసలు పట్టించుకోలేదన్నారు. ఫిర్యాదుపై రిసిప్ట్ ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థని శాంతిభద్రతల్ని కాపాడ్డానికి కాకుండా. ప్రత్యర్థుల్ని వేధించడానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. ప్రొటోకాల్ని పాటించని పోలీసులపై ప్రివిలేజ్మోషన్ మూవ్ చేయాల్సి వుంటుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన హితవు పలికారు. లేదంటే తగిన మూల్యం చెల్లించాల్సి వుంటుందని హెచ్చరించారు.

వైసిపి నేతల ఫిర్యాదు

రేడియాలజీ ఇమేజింగ్ కీలకం: డాక్టర్ జి.వి. సంపత్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మనిషి ఆరోగ్య స్థితిగతులను అధ్యయనం చేయడంలో రేడియాలజీ ఇమేజింగ్ టెక్నాలజీలు చాలా ముఖ్యమని నరువి హాస్పిటల్స్ వ్యవస్థాపక చైర్మన్ జీవి సంపత్ తెలిపారు. సోమవారం వేలూరు లోని నరువి హాస్పిటల్స్ వేదిక ఇండియన్ రేడియాలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ ఆన్ ప్రాక్టికల్ రేడియాలజీ అనే అంశంపై తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలకు సంబంధించిన రేడియోలజిస్టులతో ఒకరోజు కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా జీవి సంపత్ మాట్లాడుతూ వైద్య రంగంలో నేడు పరిశోధన నైపుణ్యతను కలిగిన రంగాలను మారుతున్న టెక్నాలజీతో కూడిన అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రేడియాలజీ, ఇమేజింగ్ రంగాలలో కొన్ని న్యాయపరమైన సమస్యలు ఉన్నాయన్నారు. రేడియాలజీ కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లను ఏర్పాటు చేసుకోవడానికి తగిన ఆర్థిక సహాయాన్ని పొందడం వంటి అంశాలను రేడియాలజిస్టులు సుదీర్ఘంగా చర్చించారు. రోగికి ఉన్న వ్యాధి వాటి లక్షణాలను కచ్చితంగా తెలపగలిగే సామర్థ్యం కలిగిన అధునాతన ఎక్స్- రే, సిటీ స్కాన్, టెక్నాలజీని వినియోగించుకోవాలని కొందరు తమ అభిప్రాయాలను కాన్ఫరెన్స్ ముందు ఉంచారు. ఎంతో ఉపయోగకరమైన ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు నరువి హాస్పిటల్ యాజమాన్యానికి కతజ్ఞతలు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ లో ఐఆర్ఐఏ తమిళనాడు, పుదుచ్చేరి అధ్యక్షులు రేడియాలజిస్ట్ డాక్టర్ చిన్నదురై అబ్దుల్లా, ఐఆర్ఐఏ వేలూరు యూనిట్ అధ్యక్షులు మదన్మోహన్, రాష్ట్ర కార్యదర్శి ఫ్లోరా నెల్సన్, సిఎంసి రేడియాలజీ విభాగం వైద్యులు శ్యామ్, శ్రీధర్, సహాన, నరువి హాస్పిటల్ రేడియాలజీ విభాగాధిపతి అశోక్ మిత్ర, డాక్టర్ గురుకష్ణ, డాక్టర్ ప్రియాంక కలైయరసన్, దేవరాజన్, సుబ్రమణియన్, ఐఆర్ఐఏ లీగల్ అడ్వైజర్ రవిశంకర్, డాక్టర్ ఫ్రాంక్లిన్ ఇర్విన్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ సంపత్

నేడు నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి జిల్లా పరిధిలోని తిరుపతి నగరం, శ్రీకాళహస్తి పట్టణం సమీప మండలాలలో ఉన్న నిరుద్యోగ యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించడానికి సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ప్రైస్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్), జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన 10 గంటల నుండి తిరుపతిలోని స్థానిక టిటిడిసి ప్రాంగణంలో సీడాప్ జాబ్ కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని డి ఆర్ డి ఏ పి డి శోభన్ బాబు ప్రకటనలో తెలిపారు. ఫ్యూషన్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి సహకారంతో రిలేషన్ షిప్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం నిర్వహిస్తున్న ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులకు 19-35 వయస్సు ఉండి, ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ ఉత్తీర్ణులు అయ్యి ఉండాలన్నారు. అలానే స్వంత ద్విచక్రవాహనం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్, మరిన్ని వివరాలకు 9701387293, 6302280583 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

బంజారాలకు సముచిత గుర్తింపు ఇవ్వండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలకు సముచిత గుర్తింపు ఇవ్వడం లేదని హథిరాంజీ మఠం పరిరక్షణ కమిటీ నాయకులు శివా నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాలలో బంజారాల ఆరాధ్య దైవం హథిరాం బావాజీ ఆస్తులు ఉన్నాయని, ఇప్పటివరకు మఠం నిర్వాహకులు ఆయనకు ఆలయాన్ని నిర్మించలేదన్నారు. టిటిడి ధర్మకర్తల మండలిలో బంజారాలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల కాలంగా మఠంకు చెందిన భూములు అన్యాక్రాంతమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదన్నారు. బంజారాలకు తిరుపతిలో ఉన్న హథిరాంజీ మఠంలో తగిన వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తమని కేవలం ఓటర్లుగా మాత్రమే పరిగణించడం సమంజసం కాదని నాయకులకు సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో అశోక్ రాథోడ్, రవి రాథోడ్, గజా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అన్నీ తానై...అంత్యక్రియల్లో..!

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు కుటుంబసభ్యులు, సన్నిహితుల మధ్య ఆదివారం జరిగాయి. సోమవారం నారావారిపల్లిలోని ఇంట్లో సాంప్రదాయబద్ధ కార్యక్రమాల్లో చంద్రబాబునాయుడు, నారా లోకేష్ దంపతులు పాల్గొన్నారు. ఈనెల 28న గురువారం నారావారిపల్లిలో కర్మక్రియలు నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్లను సైతం తిరుపతి జిల్లా ఎస్పి సుబ్బరాయుడు ఉన్నతాధికారులతో కలిసి ఎంఎల్ఎ పులివర్తి నాని ఆధ్వర్యంలో పరిశీలించారు. కర్మక్రియలు పూర్తయ్యేంత వరకూ పులివర్తినాని అన్నీ తానై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటం గమనార్హం. నారా రామ్మూర్తినాయుడు కుమారుడు నారా రోహిత్ 13 రోజుల పాటు చంద్రబాబు నివాసంలోనే ఉంటూ రోజువారీ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సమాచారం. సోమవారం సాయంత్రం నారా చంద్రబాబునాయుడు, లోకేష్లు రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాద్కు తిరుగు ప్రయాణమయ్యారని సమాచారం. వీరికి శ్రీకాళహస్తి, పలమనేరు, చంద్రగిరి, వెంకటగిరి ఎంఎల్ఎలు బొజ్జల సుధీర్రెడ్డి, అమరనాథరెడ్డి, పులివర్తి నాని, కురుగొండ్ల రామకృష్ణ, నాయకులు డాలర్ దివాకర్రెడ్డి, మంచు మనోజ్ వీడ్కోలు పలికారు.

28న 'కర్మక్రియలకు' పులివర్తినాని ఏర్పాట్లు

చెరువు ను తలపిస్తున్న సిమెంట్ రోడ్డు

ప్రజాశక్తి - ఏర్పేడు

ఏర్పేడు మండలంలోని పాతవీరాపురం గ్రామపంచాయతీలో చిన్నపాటి వర్షానికే గ్రామపంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట సిమెంట్ రోడ్డు మీద వర్షపు నీరు చెరువును తలపిస్తోంది. ఈ వర్షపు నీరు నిల్వ ఉన్న సిమెంట్ రోడ్డు నుండి స్కూలుకు వెళ్లే పిల్లలు, సచివాలయానికి వెళ్లే ప్రజలు వర్షాకాలంలో ప్రతినిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది పిల్లలు, వద్ధులు నీరు నిల్వ ఉండడం వలన కాలుజారి మురికి నీళ్లలో పడిన సందర్భాలు అనేకం. ఈ సమస్యపై నాయకులు, అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఎలక్షన్ టైంలో నాయకులు మాట ఇచ్చి, తీరా గెలిచాక పట్టించుకోనే నాధుడే లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి నీరు నిల్వ లేకుండా మళ్లీ సిమెంట్ రోడ్డు నిర్మించాలని రేణిగుంట, ఏర్పేడు మండలాల సిపిఎం కన్వీనర్ హరినాథ్, నాయకులు రంగయ్య విజ్ఞప్తి చేశారు.

శ్రీవారికి వెండి పూజా సామగ్రి వితరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుమల శ్రీవారికి 7లక్షల విలువైన పూజా సామాగ్రి వితరణ చేశారు. సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం కనసానివారిపల్లె కు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త యం.జి రెడ్డి తిరుమల వెంకటేశ్వరస్వామికి 7లక్షల రూపాయల విలువైన 6.7 కిలోల వెండి పూజా సామాగ్రిని సోమవారం ఆలయంలోని శ్రీవారి హుండీలో వేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు యంజి రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం యం.జి రెడ్డి మాట్లాడుతూ శ్రీవారికి పూజా సామాగ్రిని అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: రాష్ట్రీయ బాల సురక్షలో భాగంగా మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డిఎస్ వెంకటేశులు, ఎంఈవో రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో దాదాపు 30 రకాల జబ్బులను పిల్లల్లో గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స కాకుంటే జిల్లా ఆస్పత్రికి పంపుతామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆరోగ్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి-బియన్ కండ్రిగ: ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం అర్హులందరికీ రెంటు సెంట్లు ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇప్పించాలని సిపిఐ నాయకులు కోరారు. పోరుబాటలో భాగంగా గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ బిఎన్ కండ్రిగ గ్రామ సచివాలయం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు భాస్కర్, చంద్రమ్మ, రాజేశ్వరి, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : పేద ప్రజలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల చొప్పున మంజూరు చేయాలని కోరుతూ బికేఎంయు (సిపిఐ) ఆధ్వర్యంలో పుత్తూరు తహశీల్దారు వెంకటేశ్వర్లుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పుత్తూరు పట్టణ కార్యదర్శి డి మహేష్ మాట్లాడుతూ లబ్ధిదారులు రోజా, అమ్ములు, మీనా, రాములు, మూర్తి, మహిళలు పాల్గొన్నారు.

వేలం పాట

ప్రజాశక్తి - గూడూరు టౌన్: కూటమి గత ప్రభుత్వంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎత్తివేసి, ప్రైవేట్ దుకాణాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సామగ్రిని ఈనెల ఉదయం పది గంటలకు ఓజిలి లోని డిపో వద్ద వేలం వేస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీజర్‌లు, ఇన్వర్టర్‌లు , క్యాష్ చెస్ట్, స్కానర్లు , క్యాష్ కౌంటింగ్ మెషీన్స్‌లు వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే వాళ్లు 5 వేల రూపాయలు ధరావత్తును చెల్లించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన జిఎస్‌టినీ కూడా చెల్లించాలని పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

మంత్రి ఆనంను కలిసిన ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు: రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామా నారాయణ రెడ్డిని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సోమవారం వారి ఛాంబర్‌లో కలసి నియోజకవర్గం పరిధిలోని దేవాలయాలు అర్చకులకు గౌరవ వేతనం అందించాలని, నిరుపయోగంగా ఉన్న పలు దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గూడూరు ఎమ్మెల్యే వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, పార్లమెంట్ రైతు కార్యనిర్వాహక కార్యదర్శి నెల్లూరు మోహన్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, వెంకన్న పాలెం పంచాయతీ సర్పంచ్ కోకొల్ల మధు యాదవ్, గూడూరు మండలం ప్రధాన కార్యదర్శి ముమ్మడి అమరేంద్ర, మండల బిసి నాయకులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని చిన్నయగుంట, జంబుగోళం పంచాయతీలలో ఇటీవల కురిసిన వర్షాలకు పంటకు నష్టం వాటిల్లిన నష్టాన్ని ఆర్ అనంతపురం గ్రామ సచివాలయం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ అధికారి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు పి వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ ఇటీవల వర్షాల కారణంగా చిన్నయగుంట పంచాయతీ జంబుగోళం గ్రామంలో దాదాపు 30 ఎకరాల వరకు పంట పొలాల్లో వరి నారు మునిగి పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికే వేల రూపాయలు రైతులు నష్టపోయారని రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో కత్తి సురేష్, జానకి రామయ్య, శ్రీరాములు, విజయ్ కుమార్, శ్రీదేవి, సుందరమ్మ, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ కూరగాయలతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రకృతి వ్యవసాయ కూరగాయలను విక్రయిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -రామచంద్రాపురం: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన కూరగాయలు, ఆకుకూరలను ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి జి ప్రవతి అన్నారు. సోమవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పండించిన కూరగాయలను మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది ఏర్పాటుచేసిన స్టాల్‌లో విక్రయాలను ఏవో ప్రవతి ప్రారంభించారు. ఈ క్రమంలో కొనుగోలు చేసిన కూరగాయలను, ఆకులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు పండించడం ద్వారా రైతులకు కూడా మంచి భూసారం చూపించి అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన కూరగాయలను ప్రతి ఒక్కరు కొనుగోలు చేసి రైతులను ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ యూనిట్ ఇన్‌ఛార్జులు, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

టిడిపి మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో సభ్యత్వనమోదు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టిడిపి మైనారిటీ సెల్ నేతల ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదును సోమవారం నిర్వహించారు. అందులో భాగంగా పుత్తూరు పట్టణం గేట్ మసీదు వద్ద ముస్లిం సోదరులు ఆ పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సభ్యత్వ రుసుం తీసుకొచ్చి సభ్యత్వం స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గేట్ మసీదు మస్జిద్ ఏ ముఖద్దస్ ముతవల్లి మహమ్మద్ గౌస్ , నియోజకవర్గం టిడిపి మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎ రఫీ, అహమ్మద్, చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కే. షబ్బర్ ,నగరి నియోజకవర్గం తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్.హమీద్ బాషా, పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ,నగరి నియోజకవర్గం మైనారిటీ అధికార ప్రతినిధి చాను,యూనస్, రసూల్,సుల్తానా, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న వైరల్ ఫీవర్

- ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూ కడుతున్న ప్రజలు
- అల్పపీడన ప్రభావంతో మారిన వాతావరణం

ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: గ్రామీణ ప్రాంత ప్రజలను వైరల్ ఫీవర్ వణికిస్తోంది. వాతావరణంలో వచ్చిన అల్పపీడన ప్రభావంతో మండలంలో పలు పంచాయతీల్లో విష జ్వరాలు వ్యాపిస్తున్నాయి. దీంతో జ్వర పీడితులు అధిక సంఖ్యలో స్థానిక ప్రైవేటు, ప్రభుత్వ వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని వెస్ట్రవరత్తూరు, కుంభ్యంబాకం, కంపాలెం, మరి కొన్ని పంచాయతీలలో విషజ్వరాలు ప్రభావం అధికంగా వుంది.

ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూ కడుతున్న ప్రజలు

గత నాలుగైదు రోజులుగా అల్పపీడన ప్రభావంతో వాతావరణం మారిపోవడంతో గాలి, నీరు కలుషితం కావడంతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. బుచ్చినాయుడు కండ్రిగ ప్రభుత్వ ఆస్పత్రికి, ప్రైవేటు ఆస్పత్రులకు జ్వర పీడితులు పదుల సంఖ్యలో క్యూ కడుతు న్నారు. దీన్ని ఆసరగా చేసుకుని ప్రైవేట్ ఆస్పత్రి దక్కరు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. మండలంలో కూడా జ్వర పరిస్థితి నెలకొంది. కాని మండలంలో ప్రభుత్వ ఆస్పత్రులు వున్నా ఎక్కువగా ప్రైవేట్ ఆస్పత్రులకే జ్వర పీడితులు వెళుతున్నారు.

ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

వాతావరణం మార్పుల వల్ల జ్వరాలు వస్తున్నాయి. ఆస్పత్రికి చాలా మంది జ్వర పీడితులు వస్తున్నారు. కచ్చితంగా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ముఖ్యం గా చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులకు వేడి ఆహారం, వేడి నీళ్లు కచ్చితంగా తాగించాలి. వేడి దుస్తులు ధరించాలలి. దగ్గు, జలుబు, తీవ్ర జ్వరం ఉన్న వారికి కాస్త దూరంగా ఉండాలి. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు వ్యాధి ముదిరే వరకు చూడ కుండా వెంటనే వైద్యం చేయించుకోవాలి. తాగు నీరు కలుషితం కాకుండా కాచిన నీటిని తాగాలి.

- డాక్టరు దివాకర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి.

26న ధర్నాను విజయవంతం చేయండి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ రైతాంగ , కార్మిక , ప్రజల వ్యతిరేక విధానాల పై తిరుపతి కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 26వ తేదీ జరిగే ధర్నా ను విజయవంతం చేయాలని గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివ కుమార్ పేర్కొన్నారు. గూడూరు సిపిఎం కార్యాలయంలో వారు ఈ సందర్భంగా ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జోగి శివ కుమార్ మాట్లాడుతూ రైతులకు గిట్టు బాటు ధర కల్పించాలని, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బ తింటున్నాయని, పంట రుణ మాఫీ చేయాలన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులకు పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలని కోరారు. ల్యాండ్ లీజ్ యాక్ట్‌లో భూ యజమాని సంతకం ఉండాలన్న నిబంధన తొలగించాలని కోరారు. వ్యవసాయ మోటార్లకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించకూడదన్నారు. 26వ తేదీన ధర్నాలో నియోజకవర్గ రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శంకరయ్య , సిఐటియు నాయకులు సురేష్, బివి రమణయ్య , చంద్రయ్య , కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి అడపాల ప్రసాద్ , వెంకట్‌రావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై తిరుపతి కలెక్టరేట్ వద్ద ఈ నెల 26వ తేదీ నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఏర్పేడు మండలంలోని చిందేపల్లిలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామిశెట్టి వెంకయ్య సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున రైతులు కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ, పట్టణ, పేద మహిళలు న్యాయమైన డిమాండ్లపై ధర్నా చేపట్టనున్నారని పేర్కొన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - సత్యవేడు: స్థానిక వ్యవసాయ శాఖ ఏవో మురళి ఆధ్వర్యంలో సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ సుందర్ రామిరెడ్డి, మాజీ ఎంపీపీ మస్తాన్, టిడిపి మాజీ మండల అధ్యక్షులు పరమశివం, బెల్లు రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్ సిక్స్ లో భాగంగా వ్యవసాయ పెట్టుబడి కింద రైతులకు ఏడాదికి 20 వేల రూపాయలు ఇచ్చే ప్రక్రియకు త్వరలోనే శ్రీకారం చుట్టనున్నట్టు ఆయన పేర్కొన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకొచ్చి బయోమెట్రిక్ ద్వారా రైతులు వేరుశనగ విత్తనాలను తీసుకోవ చ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బాలయ్య, టిడిపి నాయకు లు సుబ్రహ్మణ్యం రాజు, శశిమోహన్ నాయుడు, మురళి (కోళ్ల చిన్న), ధనశేఖర్, షణ్ముగం, గణేష్,ఆనంద్, అరుల్ నాదన్, కాశీప్రతాప్‌రెడ్డి, గ్రామీణ వ్యవసాయ అసిస్టెంట్లు మదన్మోహన్, రుద్రయ్య,స్వర్ణ, మురళి, పురుషోత్తం పలువురు రైతులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానం పెంచుకోవాలి: ప్రిన్సిపాల్

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - సత్యవేడు: విద్యార్థులు పుస్తకపఠనంతో జ్ఞానం పెంచుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి సుజాత సూచించారు. సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి సుజాత మాట్లాడుతూ స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించి విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలని సూచించారు. విజ్ఞానం పెంపుతో వ్యక్తిత్వ వికాసం పొందవచ్చని తెలిపారు. కళాశాల విద్యార్థులకు ఈ నెల 20వ తేదీ ఆన్‌లైను క్విజ్ , స్లోగన్ రైటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. పోటీ పరీక్షల పుస్తకాలను, అకాడమిక్ పుస్తకాలను దినపత్రికలను విద్యార్థులు, అధ్యాపకులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులైన శామ్యూల్, అరవింద్, హన్నా, మురళీమోహన్ ఢిల్లీ ప్రసాద్, హరి ప్రసాద్, ఎంవెంకటేశ్వర్లు, సుధాకర్, హరిప్రసాద్, బాష ఈశ్వర్ జీ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: నారాయణ వనం మండల కేంద్రంలోని జీవన్ జడ్పీ పి హైస్కూలులో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పట్ల అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు చిన్నతనం నుండి పిల్లలను గ్రంథాలయం పట్ల అవగాహన కల్పించి గ్రంథాలయ అలవాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జీవన్, హెచ్ఎం సులోచన, ఉపాధ్యాయులు ప్రభాకర్ నాయుడు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుత్తూరు బాలికల పాఠశాలలో, మెయిన్ స్కూలు విద్యార్థులకు. వ్యాసరచన పోటీలు పుత్తూరు శాఖ గ్రంథాలయ అధికారి మీనా కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ఈ నెల 20వ తేదీ ముగింపు సందర్భంగా బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సభ్యులు జడ్పీ హైస్కూల్ బాలికల పాఠశాల ఉపాధ్యాయులు, ఎంపీయుపి మెయిన్ స్కూల్, ఉపాధ్యాయులు, ఎంపీపీ స్కూల్ ఎస్ ఆర్ చేర్లోపల్లి ఉపాధి ఉపాధ్యాయులు. విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది సుజాత పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలి

మాట్లాడుతున్న భూగర్భజల శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ పివి కృష్ణారావు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దినదినాభివృద్ధి చెందుతున్న నేటి తరుణంలో విద్యార్థి దశ నుంచి పర్యావరణ పరిరక్షణపై కనీస అవగాహన కలిగి ఉండాలని భూగర్భ జల శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ పీవీ కృష్ణారావు పిలుపు నిచ్చారు. స్థానిక పెరుమాళ్ల పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం తిరుపతి మానవతా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని శాశ్వతంగా నిర్మూలించాల్సిన అవసరం వుందన్నారు. మానవతా ఛైర్మన్ ఎన్ భార్గవ, అధ్యక్షులు ఎంవి రమణ, హెడ్మాస్టర్ వి నాగమణి మాట్లాడుతూ బాల్య దశ నుంచి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిత్యజీవితంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించే దిశగా పెద్దలకు అవగాహన కల్పించి నడుచుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా భూ సంరక్షణ నిమిత్తం, భూగర్భ జలాల పెంపు కోసం మొక్కలు నాటడం వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వీరితోపాటు ఉపాధ్యాయులు సాంబశివారెడ్డి, సిద్దయ్య, అపరాజిత,చిట్టెమ్మ, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

మంగళం ఉన్నత పాఠశాలకు ఎడిఫై వితరణ

ఉన్నత పాఠశాలకు సామగ్రిని వితరణ చేసిన ఎడిఫై పాఠశాల నిర్వాహకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) మంగళం పరిధిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ మంగళం ట్రెండ్స్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కృష్ణమ నాయుడు చొరవతో తిరుపతి రూరల్ పరిధిలోని ఎడిఫై పాఠశాల నిర్వాహకులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన రెండు లక్షల విలువైన వస్తు సామగ్రిని అందించారని పాఠశాల ప్రధానోపాధ్యా యులు కేశవులు నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో వస్తు సామగ్రిని అందజేశారన్నారు. ఎడిఫై పాఠశాలలో 9, పదవ తరగతి చదివే విద్యార్థిని విద్యార్థులు సేకరించిన నగదు మొత్తం, యాజమాన్య వితరణతో కలిపి రెండు లక్షల విలువైన సైన్స్, సాంఘిక, గణిత శాస్త్రాలకు సంబంధించిన ప్రయోగశాల సామగ్రిని అందించారన్నారు. ఎడిఫై విద్యార్థుల సామాజిక బాధ్యతను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఎడిఫై పాఠశాల ప్రిన్సిపాల్ దేవరాజులు మాట్లాడుతూ ఈ సామగ్రిని ఉపయోగించుకుని రాబోయే సైన్స్ డే లో మంచి ప్రదర్శనలను విద్యార్థులు ఏర్పాటు చేయాలని కోరారు. ఎడిఫై అకాడమిక్ డీన్ జాహ్నవి మాట్లాడుతూ బావి భారత శాస్త్రవేత్తలుగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. ఎడిఫై పాఠశాల డైరెక్టర్ ప్రణీత్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

క్రైం న్యూస్

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: లారీ వేగంగా ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి పట్టణ శివారులోని వీఎంపల్లి సమీపంలో మదనపల్లి-నాయుడుపేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. టూ టౌన్ పోలీసుల కథనం మేరకు.. వెంకటగిరికి సమీపంలోని చిన్నప్పరెడ్డి కండ్రిగకు చెందిన ప్రసాద్(44) ఫెర్టిలైజర్ వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం యథావిధిగా వ్యాపారం ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా వీఎంపల్లి సమీపంలో వెనుక నుంచి లారీ వేగంగా ఢీ కొంది. ఈ ఘటనలో ప్రసాద్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. లారీ ప్రసాద్ మీదుగా వెళ్లిపోవడంతో శరీరం నుజ్జునుజ్జయ్యింది. ఘటనకు కారణమైన లారీ డ్రైవర్ పరారీ అయ్యాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశులు తెలిపారు.

నూతన ఔషధాలను ఆవిష్కరించాలి

ప్రజాశక్తి- రామచంద్రపురం: సమాజంలో ప్రజలకు ఉపయోగకరమైన నూతన ఔషధాల తయారీపై ఫార్మసి విద్యార్థులు అడుగులు వేయాలని శ్రీ వెంకటేశ్వర గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఫార్మసీ విభా గాధిపతి డాక్టర్ జి కృష్ణమూర్తి నాయుడు కోరారు . మండలంలోని వెంకటరా మపురం సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ఆవరణలో నిర్వహి స్తున్న జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగం గా సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబు ఆధ్వర్యంలో కొన సాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీలో వచ్చే నూతన పద్ధతుల్లో పై అవగాహన పెంచుకొని నూతన ఆవిష్కరణలపై శ్రద్ధ చూపాలని కోరారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రసన్నరాజు, సిబ్బంది, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు .

ఉపాధ్యాయుడిని నియమించండి..

ప్రజాశక్తి- చిల్లకూరు : చిల్లకూరు మండల పరిధిలోని నాంచారం పేట గ్రామ రెవెన్యూ పెంటపాడు గ్రామంలో ఓ ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్తులు సోమవారం ఎంపీడీవో, ఎంఈఓలకు సోమవారం వినతి పత్రం అందించారు. తమ గ్రామంలో ఎస్సీ, ఎస్టీ , బీసీ విద్యార్థులు 81 మంది ఉన్నారని నలుగురు ఉపాధ్యాయులు ఉండగా ప్రస్తుతం ఇద్దరూ ఉపాధ్యాయులే ఉన్నారని ఒక ఉపాధ్యాయుని వెంటనే నియమించాలని కోరారు.

మంత్రిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి -కోట : రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఎమ్ డీ ఫరూక్‌ని గూడూరు నియోజకవర్గంలో మైనారిటీ సమస్యలు, షాదీ మంజిల్, మదర్‌సా ల అభివృద్ధికి నిధులు,, కోట షాదీ మంజిల్‌లో అదనపు గదులు, మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరు చేయాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సమక్షంలో కోట టీడీపీ నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, పార్లమెంట్ రైతు కార్యనిర్వాహక కార్యదర్శి నెల్లూరు మోహన్ రెడ్డి, ఉచ్చూరు రవీంద్ర రెడ్డి, వెంకన్న పాలెం పంచాయతీ సర్పంచ్ భర్త కోకొర్ల మధు యాదవ్, గూడూరు మండలం ప్రధాన కార్యదర్శి ముమ్మడి అమరేంద్ర, మండల బీసీ ప్రధాన కార్యదర్శి మారుబోయిన దామోదర్ పాల్గొన్నారు.

శివుని సేవలో రైల్వే ఐజీజీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రైల్వే శాఖా ఐజీజీ ఈశ్వరరావు సోమవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ రెడ్డి సంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామీ, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందించారు.

దుగరాజపట్నం పోర్టుతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ పిలుపు

ప్రజాశక్తి -కోట : దుగరాజపట్నం పోర్టు తో నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటాయని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. సోమవారం కోటలోని గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ దుగరాజపట్నం ఆంధ్రుల హక్కు ఏపీ విభజన చట్టంలో పోలవరం, దుగరాజపట్నం పోర్టు ప్రత్యేక అంశాలు అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం గురించి మాట్లాడతారేకాని, దుగరాజపట్నం పోర్టు గురించి నోరెత్తరని వాపోయారు. దుగరాజపట్నం పోర్టు వల్ల పరిశ్రమలు వస్తాయని, వేల మందికి మంచి ఉద్యోగాలు వస్తాయని తెలిపారు .రైతులు ఆర్థికంగా అభివృద్ధి మార్గంలో ఉంటారని, దాదాపు ఒక లక్ష మంది రైతులు కోటీశ్వరులవుతారన్నారు. మూడు నాలుగు లక్షల మంది బలహీన వర్గాలు లక్షాధికారులవుతారని సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు, కోట, వాకాడు, చిట్టమూరు పట్టణాలుగా అభివృద్ధి చెందుతాయని పిలుపు నిచ్చారు. అందుకే కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఏపీ విభజన చట్టంలో చేర్పించారని, దీని వల్ల మన ప్రాంతం ఎంతో అభివృద్ధికి వస్తుందన్నారు. ఇది సాధించడం ఎలా? రైతులు, నిరుద్యోగులు, నిరుపేదలు చైతన్య వంతులు కావాలన్నారు. ప్రస్తుతం దీన్ని చంద్రబాబు ఆపారన్నారు. మన ప్రాంతం అభివృద్ధి గురించి ఆలోచించడం లేదని అసహనం వ్యక్తం చేశారు.

భవిష్యత్తు మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీదే

డాక్టర్ జె సోమశేఖర్

ప్రజాశక్తి - క్యాంపస్ : భవిష్యత్తు మెషిన్ లెర్నింగ్, సైబర్‌సెక్యూరిటీదే అని డాక్టర్ జె సోమశేఖర్ అన్నారు. చిత్తూరులోని కటికపాలి గ్రామానికి చెందిన డాక్టర్ జె. సోమశేఖర్‌కు ఇటీవల మలేషియాలోని ఐఎన్టిఐ ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో క్యాంపస్ విజిట్‌లో ముఖ్య వక్తగా, రీసెర్చ్ ఫెలోగా పనిచేయడానికి ఆహ్వానం అందింది. ఈ పర్యటన సందర్భంగా సదస్సుకు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఏఐ, మెషిన్ లెర్నింగ్, సైబర్‌సెక్యూరిటీ అభివృద్ధి చెందుతున్న అంశాలపై మాట్లాడుతూ ప్రస్తుతం సోమశేఖర్ బెంగుళూరులోని జైన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్, ప్రోగ్రామ్ హెడ్‌గా పనిచేస్తున్నారు. డాక్టర్ సోమశేఖర్ ఇండెక్స్డ్ ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో అనేక వ్యాసాలను ప్రచురించారు. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సమావేశాలలో పత్రాలను సమర్పించారు.

రాష్ట్రస్థాయిలో మొదటి స్థానమే లక్ష్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. టిడిపి సభ్యత్వ నమోదులో శ్రీకాళహస్తి నియోజకవర్గం అప్రహితంగా దూసుకెళ్తున్న సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ భవన్లో కార్యకర్తల నడుమ ఎమ్మెల్యే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మరింత వేగం పెంచి సభ్యత్వ నమోదులో ప్రజల్ని భాగస్వాములు చేయాలని సూచించారు. టిడిపి సభ్యత్వం పొందడం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించాలని కోరారు. పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

ఆధార్‌కు తప్పని తిప్పలు!

- సవరణల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు నిరీక్షణ
- అపార్ ఐడి నమోదుకు కష్టాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్ ఐడి నమోదుకు విద్యార్థులు తల్లిదండ్రులు అష్టకష్టాలు పడుతున్నారు. నూతన విద్యా విధానంలో జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికి జీవితకాలం గుర్తింపు సంఖ్యతో ఐడి కార్డు ప్రభుత్వం జారీ చేయనుంది. అపార్ అంటే (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్) రిజిస్ట్రీ ఇది 12 అంకెలతో ఐడి కార్డు ఉంటుంది. ఈ నెంబర్ ద్వారా ఆ విద్యార్థి ఏ పాఠశాలలో చదువుతున్నాడో తెలుస్తుంది. ఆ విద్యార్థి మరో పాఠశాలకు బదిలీ అయినా స్కూల్ రికార్డ్‌తో పాటు ఆన్‌లైన్‌లో మారుతుంది. ఇంతటి విశిష్టత కలిగిన అపార్ ఐడి కోసం తల్లిదండ్రులు హాస్పిటల్స్ , మున్సిపల్ కార్యాలయం, సేవా కేంద్రాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కారణం అపార్ నమోదు చేయాలంటే స్కూలు రికార్డ్స్, ఆధార్ రికార్డులలో ఒకే రకమైన వివరాలు విధిగా ఉండాలి. దీంతో తల్లిదండ్రులు సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ రెండు రికార్డులు ఎక్కువ మంది విద్యార్థులకు పుట్టిన తేదీ, విద్యార్థితో పాటు తల్లిదండ్రుల పేర్లు, అక్షర దోషాలు అనేక మందికి ఉన్నాయి. దీంతో తొలుత జనన సర్టిఫికెట్‌లో సవరణ కోసం మున్సిపల్ కార్యాలయంలో సర్టిఫికెట్ తీసుకుని నోటరీ సర్టిఫికెట్‌తో ఆసుపత్రి వద్దకు వెళుతున్నారు. తరువాత జనన సర్టిఫికెట్ తీసుకుని మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ఆన్‌లైన్‌లో రిక్వెస్ట్ చేసుకుంటే మీ సేవ సేవా కేంద్రానికి వెళ్లి వివరాలు అప్‌లోడ్ చేయాల్సి వుంది. మీ సేవ కేంద్రంలో ఒక సవరణకు 200 రూపాయలు చెల్లించాలని డిమాండు చేస్తున్నారు. ఎన్ని సవరణలు ఉంటే అన్ని 200 చెల్లించాలని వీటికి రసీదు ఇవ్వరని, పైగా ఒక్కొక్క సవరణకు మున్సిపల్ కార్యాలయానికి ఒక్కోసారి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. అయితే మున్సిపల్ అధికారులు చూడనిదే అనుమతి రావడం లేదని, దీంతో రోజులు పడిగాపులు కాయాల్సి వస్తోందంటున్నారు. జనన రికార్డు సరి చేసుకున్న తర్వాత ఆధార్ అప్‌డేట్ వైపు పరుగులు తీస్తున్నారు. పుత్తూరు పట్టణంలో బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద ఒకే ఒక ప్రైవేట్ ఆధార్ కేంద్రం వుంది. పైగా రోజుకు 15 ఆధార్ కార్డులు మాత్రమే అప్‌డేట్ చేస్తున్నారు. దీని కోసం తల్లిదండ్రులు తెల్లవారు జామున నాలుగు గంటలకు క్యూలైన్‌లో నిలబడి టోకెన్ తీసుకోవాల్సి వస్తోంది. ఈ తతంగమంతా పూర్తి కావడానికి కనీసం 15 రోజులు పడుతుంది. తల్లిదండ్రులు కష్టాలు, డబ్బులు వృథా అవుతున్నాయే తప్ప పనులు ముందుకు సాగడం లేదు. ఇకనైనా జిల్లా అధికారులు చొరవ తీసుకొని అదనపు ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి మీసేవ కేంద్రానికి అనుమతి ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అందరికీ అందుబాటులో నాణ్యమైన ఇసుక



భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీ నాయక్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అందరికీ అందుబాటులో నాణ్యమైన ఇసుకను అందించాలని ఉద్దేశంతో తిరుపతి రూరల్ పరిధిలో అవిలాల, కాటన్ మిల్లు, గాజుల మన్యం వద్ద స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీ నాయక్ తెలిపారు. జిల్లాలో ఇసుక కొరత లేకుండా నూతనంగా మూడు రీచ్ పాయింట్లను ఇప్పటికే గుర్తించామన్నారు. పెళ్లకూరులో రెండు, గూడలి వద్ద ఒక రీచ్ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వాగుల్లో, వంకల్లో ఇసుకను ఆయా స్థానిక ప్రజలు మాత్రమే వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిందన్నారు. వరదల కారణంగా డీకేటి భూములు, పట్టా భూములలో ఇసుక మేటలు ఏర్పడితే వాటిని అమ్ముకోవడానికి తమ శాఖ ద్వారా అనుమతులు ఇస్తామన్నారు. ఇందుకు ఆయా భూ యజమానులు వారి హక్కు పత్రాలతో తమ శాఖకు అర్జీ ఇవ్వాలన్నారు. అంతరాష్ట్ర సరిహద్దుల నుండి ఇసుకను అక్రమంగా తరలించకపోతే కఠిన చర్యలు తీసుకొని, వారి జరిమానాలు విధిస్తామన్నారు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తుంటే 1800 425 6035 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE: TIRUPATI
I.P.NO.12/2024

Sajjan Devi Nahata ...Petitioner
V/s
K.Hemalatha and others ...Respondents

I.P.Summons to Respondents 1,3,5, 9 and 12

R1) K.Hemalatha W/o K.Harikrishna D.No.18-2-51/A, Ashok Nagar, Tirupati Town, Tirupati (Dt.)
R3) N.Bharani D.No.10-24-S6-260, K.K.Layout, Tirupati Town, Tirupati (Dt.)
R5) T.Aruna D.No.12-8-53-286, Madhura Nagar, Tirupati Town, Tirupati (Dt.)
R9) J.Revathi D.No.6-7-573, Srinivasa Towers, Sripuram Colony, Plot No.406, Tirupati Town, Tirupati (Dt.)
R12) S.Kalpana, Near Prasanth School, Korlagunta Tirupati Town, Tirupati (Dt)

The Petitioner filed a suit for insolvency against the Respondents 1,3,5,9 and 12. The above case is posted on 26.11.2024 at 10.30 a.m. in the above court for their appearance and raise objections if any either in person or through your advocate otherwise the matter will be decided on the records available in the case.

Hearing Date: 26.11.2024

T.M.PURUSHOTHAM
Advocate, Tirupati

కంపెనీలు పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలి: టిడిపి

ప్రజాశక్తి -కోట : కంపెనీలు ద్వారా పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమూరు మురళి, తిరుపతి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇన్నమాల అశోక్, వాటంబేటి చెంగల్ రావు అన్నారు. సోమవారం టిడిపి నాయకులు కోట మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమూరు మురళి ఆధ్వర్యంలో తిరుపతి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇన్నమాల అనోక్, టిఎన్టీయూసీ నియోజకవర్గం అధ్యక్షులు వాటంబెటి చంగలరావు, చల్లా సురేష్, ఉమ్మడి కృష్ణ వేణయ్య, కుమారి వేణయ్య, కుమారి వెంకయ్య, ఉమ్మడి రాజా, కొంతమంది టిడిపి నాయకులు కొత్తపట్నం, తమ్మినపట్నం పంచాయతీల్లో రోడ్డు పనుల గురించి బీవీఎస్ఆర్ కంపెనీ జనరల్ మేనేజర్‌ను కలిశారు. అందులో భాగంగానే అక్కడ ఎలా పనులు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ జరుగుతున్నది కేవలం సాయిల్ టెస్ట్, దానికి సంబంధించి అడివిలో వెళ్లడానికి గ్రావెల్ రోడ్డు, ఏపిఐఐసీ ల్యాండ్, ఫారెస్ట్ ల్యాండ్, ఇతర కంపెనీ ల్యాండ్ కి హద్దులుగా చిన్న పోల్స్ వర్క్ జరుగుతోందని వారు టీడీపీ నాయకులుకు చెప్పగా ఇక మీదట ఎలాంటి పనులు చేయొద్దని గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్, కలెక్టర్, స్థానిక తహశీల్దారులు తమకు ఆదేశాలు ఇచ్చారని వారికీ తెలిపారు. అనంతరం టిడిపి నాయకులు రైతులకు, గ్రామస్తులు అన్యాయం జరగకుండా వారికి నష్టపరిహారం అందించి తర్వాత పనులు మొదలు పెట్టాలని కోరారు. అంతేకాకుండా పంచాయతీలు మరెన్నో కొత్త కంపెనీలు వచ్చి పంచాయతీ అభివృద్ధికి దోహదపడాలని కంపెనీ వారిని అడిగారని టీడీపీ నాయకులు తెలిపారు. పంచాయతీలోని ఆక్రమణ భూమికి కలెక్టర్ నాలుగు లక్షలు నష్టపరిహారం ఇస్తామని చెప్పగా, తక్షణమే ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ దాన్ని ఏడు లక్షలు వరకు తీసుకువచ్చిన ఘనత సునీల్ అన్నకి దక్కుతుందని వారు తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ భూమి సాగు చేసుకుంటున్న నిరుపేదలకు నష్టపరిహారం అసలు ఇస్తారో లేదో అని చెప్పిన ఈ వైసీపీ నాయకులే ఇప్పుడు ఏడు లక్షలు నష్టపరిహారం సరిపోదని చెప్పడం విడ్డూరంగా ఉందని టిడిపి నాయకులు అన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వర్సిటీలో 50 వేల దీపాలతో కార్తీక దీపోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మూడవ కార్తీక సోమవారం రోజు సాయంత్రం 6 గంటలకు వర్సిటీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిన 50వేల దీపాలతో ఘనంగా కార్తీక దీపోత్సవం నిర్వహించారు. వర్సిటీ ఉపకులపతి దంపతులు రాజ్యలక్ష్మి, ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ దంపతులు ఆచార్య భూపతి నాయుడు దీపాలను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపక ,అధ్యాపకేతర సిబ్బంది, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందాలతో ఉండాలని, వారి జీవితాలలో మంచి వెలుగు నివ్వాలని ప్రార్థించామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు భాను, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, ఎస్వీయూ ఇంజనీర్ తాండవ కృష్ణ, ఆడిటోరియం శ్రీనివాస్, అకడమిక్ కన్సల్టెంట్ డా. ఓబులేష్ టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు ఆర్కే నాయుడు, గుండాల గోపీనాథ్ పాల్గొన్నారు.

విఐ యూజర్లకు మెరుగైన ఇండోర్ నెట్‌వర్క్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 20 జిల్లాలకు పైగా యువకులకు మెరుగైన ఇండోర్ నెట్‌వర్క్‌ను అందించనున్నట్లు వొడాఫోన్ ఐడియా క్లస్టర్ బిజినెస్ హెడ్ (ఏపీ అండ్ తెలంగాణ అండ్ కర్ణాటక) ఆనంద్ దానీ తెలిపారు. ఆ సంస్థ సెల్ టవర్లు అప్ గ్రేడ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విఐ గిగానేట్ పటిష్టమైన ఇండోర్ నెట్‌వర్క్‌ను అందించేలా 900 ఎంహెచ్ జడ్ స్పెక్ట్రంకు 3450 సెల్ ఫోన్ టవర్లు అప్‌గ్రేడ్ చేశారని పేర్కొన్నారు. 2024 జూన్‌లో ముగిసిన స్పెక్ట్రం వేలంలో 900 ఎంహెచ్‌జడ్ బ్యాండ్‌కి సంబంధించి రూ. 691 కోట్లు విలువ చేసే 2.4 ఎంహెచ్ జడ్ స్పెక్ట్రం కొనుగోలు చేశామన్నారు. 2500 ఎంహెచ్ జడ్ బ్యాండ్‌లో నెట్‌వర్క్ సామర్థ్యాన్ని రెట్టింపు చేసుకునే దిశగా 5వేలు సెల్ ఫోన్ టవర్ల వ్యాప్తంగా స్పెక్ట్రం 10 ఎంహెచ్‌జడ్ నుంచి 20 ఎంహెచ్‌జడ్ అప్‌గ్రేడ్ చేశారని తెలిపారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, కర్నూలు, అనంతపురం, కడప, ఏలూరు, ఒంగోలు, నంద్యాల, ప్రొద్దుటూరు, భీమవరం, తెనాలి, మచిలీపట్నం, నరసరావుపేట, ఆదోని, తాడిపత్రి, హిందూపురం, గుంతకల్లు, గుడివాడ, ధర్మవరం, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి మొదలైన కీలక ప్రాంతాల్లో 3,450 సైట్లలో సమర్థమంతమైన 900 ఎంహెచ్ జడ్ స్పెక్ట్రంను విజయవంతంగా వినియోగంలోకి తెచ్చింది. ఈ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం వల్ల వినియోగదారులు, ముఖ్యంగా పట్టణ ప్రాంతాలు, జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని వారు, మెరుగైన ఇండోర్ నెట్‌వర్క్ అనుభవాన్ని పొందవచ్చని వెల్లడించారు. ఈ సందర్భంగా తమ నెట్వర్క్ ద్వారా కొత్త ఆఫర్లను అందిస్తున్నామని, వినియోగదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కన్నీరు పెట్టించిన 'కృష్ణపక్షం'

కళాకారులను సత్కరించిన కస్మాపద్మ నాభం ఫ్యామిలీ

ప్రజాశక్తి - తిరుపతి: స్థానిక టీటీడీ మహతి కళాక్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పద్మనాభ నేషనల్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న నాటకోత్సవాలలో భాగంగా మూడవ రోజు సోమవారం ప్రదర్శించిన కృష్ణపక్ష నాటకం ప్రేక్షకులకు కన్నీరు తెప్పించాయి. ఇందులో నటించిన పాత్రధారులు ఆ పాత్రలకు జీవం పోశారు. అనంతరం మైరావణ పౌరాణిక నాటకం సభికులను ఎంతగానో అలరించింది.

19న నాటకోత్సవాలు ముగింపు

నేడు ఈ నాటకోత్సవాలు ముగియనున్నాయి. నాటక ప్రదర్శనలలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని .. పద్మనాభ నేషనల్ అకాడమీ సన్మానించి .. వారికి కీర్తి తెచ్చింది. ఈ కార్యక్రమంలో పద్మనాభ నేషనల్ అకాడమీ స్థాపకులు తెలుగు ,సంస్కృత , టీటీడీ ఆస్థాన పాఠశాలల విశ్రాంత ఉపాధ్యాయులు సామ్రాజ్యం , కస్మా పద్మనాభంలు పాల్గొనగా... వీరితోపాటు రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ , కార్యదర్శి కే ఎన్ రాజా , జనసేన నాయకురాలు భాగవతుల జయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా ముఖ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యార్థులకు యోగ ముఖ్యమని ఐసిడిఎస్ సూపర్వైజర్ వై రోజా రమణి తెలిపారు. వడమాలపేట మండలం పుత్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు.పరిధిలోని బాలిక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల దినోత్సవం నందు 14 నుంచి. 20వ – 2024 లో భాగంగా ఐసిడిఎస్ సిబ్బంది పిల్లలకు యోగా ప్రాముఖ్యత గురించి తెలిపారు. బాల్య వివాహాల వల్ల వచ్చే అనర్థాలు, రక్తహీనత, పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్య క్రమంలో ఎన్ ఇ ఓ. తులసీరాం. హెచ్ఎం డి. విమల, సూపర్ వైజర్లు, మనిల ఆయుష్ డాక్టర్ భాను రేఖ, వారి సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా ఏఐఎస్ఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక తిరుపతి లోని ఎస్వి యూనివర్సిటీలో ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభ అనంతరం ఎస్ వి యూనివర్సిటీలో జిల్లా ప్రతినిధుల సమావేశం చందు అధ్యక్షత సోమవారం నిర్వహించారు. ఈ ప్రతినిధుల సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి హాజరై తిరుపతి జిల్లా లో వున్న విద్యార్థుల సమస్యల కోసం నూతనంగా ఎన్నికైన కౌన్సిల్ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా నూతన కమిటీని 41 మందితో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం

తిరుపతి జిల్లా నూతన అధ్యక్షులుగా వి.ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా చంద్ర నాయక్, మోహన్, వెన్నెల, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సి. ప్రవీణ్ కుమార్, సహాయ కార్యదర్శిగా హరికృష్ణ, చందు, ఆనంద్, సూర్య, కోశాధికారిగా సతీష్ ను ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. టీటీడీ విద్య సంస్థలలో విద్యార్థులకు కుల, మత భేదాలు చూడకుండా ప్రతి ఒక్కరికి హాస్టల్ సీట్లను కల్పించాలని డిమాండ్ చేశారు. విద్య వ్యతిరేక విధానాలపైన ఉద్యమిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు వ్యతిరేకిస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడాలని పేర్కొన్నారు. జాతీయ నూతన విద్యా విధానం వల్ల రాష్ట్రంలో చాలా విద్యా సంస్థలు మూతపడ్డాయని తక్షణమే జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చంద్రగిరిలో వైభవంగా కార్తీక దీపోత్సవం

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): ప్రజల్లో ఆధ్యాత్మిక దైవచింతన, భక్తిని పెంపొందించడానికి, చంద్రగిరి ప్రజల సుభిక్షిత కోసం కార్తీక దీపోత్సవం నిర్వహించామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. చంద్రగిరి పట్టణంలో ఆంధ్రప్రదేశ్ ఈటీవీ, టీవీ ఛానల్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సౌజన్యంతో సోమవారం వైభవంగా , కార్తిక దీపోత్సవం వందలాది భక్తుల నడుమ నిర్వహించారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో ఈటీవీ, ఈనాడు సంస్థల వారు వివిధ ప్రాంతాలలో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించేవారు. ఈ సంవత్సరం ఈటీవీ ఈనాడు సంస్థల ఆధ్వర్యంలో కార్తీకమాసంలో జరిగే కార్తీక దీపోత్సవాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఆనందంగా జీవితాన్ని కొనసాగించాలని చంద్రగిరిలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు.

చంద్రగిరి పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ స్థలంలో కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసంలో ఎంతో పవిత్రంగా నిర్వహించే కార్తీక దీపోత్సవ కార్యక్రమానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సుధా రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

వీరితో పాటు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి కలెక్టర్ యస్ వెంకటేశ్వర్, టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బి.ఆర్ నాయుడు , ధర్మకర్తల మండల సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, నరసింహ యాదవ్, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, మరి కొంతమంది ప్రముఖుల తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులకు ఈటీవీ, ఈనాడు సంస్థల బృందం ఘనస్వాగతం పలికారు. పులివర్తి నాని కార్యక్రమానికి విచ్చేసిన మహిళలకు, భక్తులకు పేరుపేరునా నమస్కరిస్తూ ముందుకు సాగారు. ముఖ్య అతిథులు పులివర్తి నాని దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేద పండితులు పులివర్తి నాని దంపతులతో, వందలాది భక్తులతో కార్తీక దీపోత్సవాన్ని ప్రారంభించారు. పులివర్తి నాని దంపతుల పిలుపుతో వేలాదిగా తరలివచ్చిన మహిళలకు కృతజ్ఞతలు తెలియజేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణను అనుసరించి పూజను ప్రారంభించారు. అనంతరం వేద పండితులు మంత్రోచ్చరణ చేస్తూ కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని ఏ విధంగా చేయాలో వచ్చిన వేలాది మంది మహిళల చేత చేయిస్తూ వారికి ఈ కార్తిక దీపోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం అనంతరం ఈటీవీ ప్రతినిధులు పులివర్తి నాని దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. అతిథులకు సంస్థ తరఫున జ్ఞాపికను బహుకరించారు. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ , టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బి.ఆర్ నాయుడు , ధర్మకర్తల మండల సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, నరసింహ యాదవ్, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, మరి కొంతమంది ప్రముఖుల ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు.